# మోడల్ లవ్ లెటర్స్ (2)

పుట్టి వినాయకుడు

---

సుబ్బారావు సుందరికి ఎక్కువగా ప్రేమలేఖలు వ్రాస్తే సుందరి సుబ్బారావుని వదలి "పోస్ట్‌మన్"ను ప్రేమించి పెళ్లాడిందట.

దీనివలన తెలుసుకోవలసిన ముఖ్యమైన నీతి ఏమిటంటె ప్రేమ లేఖలు పోస్టు చేయకూడదు. కాగితంమీద నడిపిన ప్రేమ త్వరలో కార్య రూపం దాల్చకపోతే బెడిసి కొడుతుంది. మరొక విపరీతం - ఒక ఆడది మరొక సాటి ఆడదానిచేత లవ్ లెటర్స్ బట్వాడా చేయిస్తే అటువంటి కమ్మని పూరీల్లాంటి ప్రేమలేఖలను తెచ్చిన ఆ "మె సింజర్ లేడీ"నే కథా నాయకుడు లవ్వాడేస్తే (నిప్పుకోసమని వెళ్ళి ఆర్నెల్లు కడుపుతో వచ్చినట్టు) ఆ ఉత్తరాలు వ్రాసిన నిజమైన ప్రేయసి గతేంకాను ?

స్లిప్ బిట్వీన్ కప్ అండ్ లిప్ అసాధారణ మేమీ కాదు. ప్రేమలో కూడా నోటి దగ్గర కూడు పడిపోయే ప్రమాదం వుంది. జేబులోని ప్రేయసినే గద్ద తన్నుకు పోయినట్లు తన్నుకు పోయే వారున్నారు. ఈ రోజుల్లో నూరార్లు లవ్‌లెటర్స్ వ్రాసిన ప్రేయసైనా పచ్చ పచ్చగా కనిపించే పది పదిహేను పచ్చనోట్లనూ, స్కూటర్ వెనక సీటును చూపిందంటే షీ విల్ నాట్ టేక్ సో లాంగ్ టు సే గుడ్‌బై !

మగాళ్ళు కూడా బయట రంగు రంగులతో ఎగిరే సీతాకోక చిల

కల్పి చూసొచ్చి, పురుడొస్తే వాళ్ళ వాళ్ళున్నారుగదా పుట్టింటికి తోలెయ్య వచ్చని, స్థిమితంగా మేనమామ కూతురునే పెళ్లాడేస్తారు. ఈ లోకంలో ప్రస్తుతం యువతీ యువకులకు కావలసింది సాంఘిక భద్రత. అంతస్తూ, హోదా వారి వారీ జరీ అంచు కోరికలు ఏ రకంగానైనా నెరవేరటం.

కన్నె వలపులమీద కరకు కత్తులుదూసే మగాళ్ళ దుర్మార్గాల అంతు



చూసే రోజు వచ్చింది. కాల్జారిన స్త్రీలకు ఆడబోయిన తీర్థం ఎదురైనట్లు ఫామిలీ ప్లానింగ్ గొప్ప శ్రీరామరక్ష. ప్రకృతి స్త్రీ పట్ల నిర్దాక్షిణ్యంగా కల్పించిన అసౌకర్యాన్ని వీటో చేసేందుకు మగవారి మోసాలకు ఏ నుయ్యో గొయ్యో చూసుకోనవసరం లేకుండా అభాగ్య స్త్రీలను కాపాడేందుకు కుటుంబ నియంత్రణ సౌకర్యాలు అందరికీ అందుబాటులో వుండటం గొప్పవరం- అనగా బ్లెస్సింగ్ ఇన్ డిజ్‌గ్రేస్.

వెంకు పంతులుగారి కోడలికి లవ్‌లెటర్ రాసినందుకు ఎప్పుడో ఒకప్పుడు సమయం కనిపెట్టి దేహశుద్ధి చేయక మానరు అని గిరీశం అను కుంటాడు. బుచ్చమ్మకి లవ్ లెటర్స్ రాస్తే లాభంలేదని కూడా తెలుసు కుంటాడు. కనుక తేలిందేమంటే-వెంకు పంతులుగారి కోడలి లాటి వారికీ లవ్ లెటర్స్ వ్రాయకూడదు. బుచ్చమ్మలాటి వారికీ వ్రాయకూడదు. ఇద్దరు వ్యక్తుల మధ్య (అందులో ఒకరు విధిగా స్త్రీ ఐ వుండాలి) సాగే ఉత్తర కాండని గ్రంథం నడిపించడం అంటారు. వాడెక్కడ గ్రంథకర్త అంటారు. ఆడాళ్ళను కూడా ఈ ఒక్క విషయంలో పురుషులతో సమానం చేసి అబ్బ-అదెక్కడ్రా అది గ్రంథకర్త అంటారు. కాని, రచయిత్రి అనరు. ఆవిడ మంచి గ్రంథకర్తరా అంటే సిగ్గుపడాలి కాని రచయిత్రి అన్నందులకు లవలేశం సిగ్గుపడనక్కర్లేదు.

అసలు పాయింటేమిటంటే - లవ్ లెటర్స్ వ్రాయటానికి రచయిత్రి కానవసరంలేదు. రచకుడు కూడా కానవసరంలేదు. ప్రేమ అనేది కలగ చేయటానికి ఒక ప్రేయసి లేక ప్రియుడు అనే పదార్థం మాత్రం మనం రెడీ చేసుకోవాలి. మట్టి వినాయకుడిలాగ ఒక ప్రియుడంటూ ఏర్పరచు కున్నాక వాడికి అక్షతల్తో, ఆకుల్తో, పూవుల్తో పూజచేసి బెల్లం ముక్క నైవేద్యం పెట్టాలి. అరటిపండూ తాంబూలం దక్షిణా సమర్పించుకోవాలి.

మట్టి వినాయకుడ్ని రెడీ చేసుకున్నాక వాడి మొహాన్న ఇన్ని లవ్ లెటర్స్ వ్రాసి కొట్టాలి. మన వినాయకుడి విగ్రహాన్ని పట్టి మనం వ్రాసే లవ్ లెటర్స్ మోడల్ మారుస్తూ వుండాలి. ఆ ఉత్తరాల్లో వాడికి మనం గొడుగు పట్టాలి. ధూప దీప నైవేద్యాది ఆరాధనలు చేయాలి.

ఇదివర కెక్కడో చెప్పాను. కమాన్ మళ్ళీ చెబుతున్నాను, నోట్ చేసుకోండి. మగాడి హృదయానికి అడ్డదారి వాడి స్టమక్కే-అంచేత మగాడి కడుపుమీద మనం కొట్టకూడదు.

(మగాడి కడుపుమీద కొట్టకూడదంటే ఆడదాని కడుపుమీద కొట్టొచ్చని కాదు అర్థం— అస్సలెవరి కడుపుమీదా కొట్టకూడదు) కొడితే నెత్తిమీద కొట్టండి కాని (షూట్ ఎబవ్ హిజ్‌హెడ్) తిండిపెట్టకుండా, టిఫిన్ పెట్టకుండా, మంచి నీళ్ళివ్వకుండా, కాఫీ మొగాన తగలెయ్యకుండా మొగాడ్ని ఏడిపించి చంపకూడదు.

ఏవండీ దోసెత్తింటారా?

పకోడీలంటే ఇష్టవా మీకు —

సగ్గు బియ్యప్పరవాణ్ణం త్రాగుతారా—

గారెలు అరగించుకో గలరా—

ఇలాటిలాటి ప్రశ్నండిగి కళ్ళలోకి చూడాలి. అప్పుడు పోస్టుచేయని ప్రేమలేఖలకు రిప్లయ్ వ్రాయని జవాబు అతగాడి కళ్ళల్లో చదవచ్చు లవ్ సిగ్నల్స్ అని వున్నాయి. కళ్ళతో పిలవటం, అదే పనిగా చూడ్డం, చిటికెలు వేయటం, పవిటతో విసురు కుంటున్నట్లు పిలవటం, నవ్వటం, కోపంగా చూడ్డం, జడతో యాక్షన్ చేయటం. ఇదిగో- మిస్మత్నే - ప్లీజ్. అంటూ నవ్వుతూ పిలవటం వగైరా వగైరా అనేకానేక సింబాలిక్ మెథడ్స్ చాలా చాలా వున్నాయి. యివన్నీ కూడా క్విక్ రిజల్ట్సు ప్రసాదిస్తాయి. బిలీవిట్ అర్ నాట్ లవ్ గేమ్ అనగా ప్రేమ సయ్యాటలాడుట నిప్పుతో చెరలాటవే కాని పైకలా కనపడదు. నైసుగా, షోగ్గా,సిల్లీగా, లవ్లీగా ముస్తాబై ఒకరివాళ్ళో ఒకరు తలెట్టి పడుకోవడం కాదు—లవ్ సాంగ్సు పాడటం అంతకంటే కాదు. ప్రేమకు అవతలి సైడున వేవిళ్ళు, కడుపులు, పురుళ్ళూ, ఆసుపత్రులూ, పిల్లలూ, పీతుళ్ళూ వున్నాయి. సినిమాల్లోనూ రచయిత్రులు ప్రసవించిన ప్రతి నవలలోనూ ఒక సైడ్ వుంటుంది కాని రెండో సైడు అబ్సెంటే— స్నేహం స్నేహం అంటూనే పావురాయిలా, బంగారు పిచ్చుకలా వున్న పడుచుపిల్లను అనతికాలంలోనే డబుల్ డెక్కర్‌లానో, తొట్టి పడవలానో చేసి విడిచిపెట్టి నీ మీద నాకు

ప్రేమ తగ్గింది అంటాడు మన మట్టి వినాయకుడు. అంచేత పొంగుతున్న పాలల్లో ఒక నీటి చుక్క పడటం మంచిది. మిఠాయుండల్ని డబ్బాలోపెట్టి డబ్బా ఎక్కడో కనబడకుండా దాచేసినట్లు ప్రేమికుల మధ్య యెడబాటు కల్పించి అడపా తడపా విరహాగ్నిని ప్రజ్వలింపచేయాలి. ఆ మంటల్లోంచి మంచి ఒకటో రకం తాజా లవ్‌లెటర్స్ అనగా ప్రేమలేఖలు పుట్టుకొస్తాయి. ప్రేమ సక్సెస్సయితే అది సాహిత్యానికి ఘోరమైన అవమానం జరిగినట్లే. ఎందుకంటె ప్రేమ ఫెయిలయితేనే కాని లిటరేచర్‌కి సరైన న్యాయం జరగడానికి అవకాశంలేదు. ప్రేమలో నెగ్గినవారు మనల్ని ఇన్‌స్పైయిర్ చెయ్యరు. మన సానుభూతి ఎప్పుడూ దెబ్బతిన్న పిల్లలమీదే వుంటుంది.

ప్రేమే నేరమౌనా అంది లైలా- గనుక మనం నేరం చేయకుండా మట్టి వినాయకుడిని హీరోగా పెట్టుకుని మన మోడల్ లవ్ లెటర్సన్నీ అతనికే అంకితమిద్దాము. ఎలా వుంది ఐడియా? వచ్చే వారం పెనసలూ, నోట్‌బుక్కూ, ఒక రబ్బరూ, అద్దుడు కాయితం, అట్టా - క్లిప్పూ, తెచ్చుకోండి. మోడల్ లవ్‌లెటర్స్ చెప్తాను. నోట్లోంచి వేళ్ళు తీసెయ్యండి (లవ్‌లెటర్సు వ్రాసేముందు నోట్లోంచి వేళ్ళు తీసెయ్యాలి)